ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో వ్యాపారులు, వివిధ సంఘాల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలందరూ సహకారం అందించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు నేరస్థులను పట్టుకోవడానికి కెమెరాలు ఉపయోగపడతాయని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రధాన పాత్రను పోషిస్తాయని తెలిపారు. మండలకేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించిన వ్యాపారులను అభినందించారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, షాబాన్, సంఘాల నాయకులు గుమ్మడి సత్యనారాయణ, శృంగారపు రంగాచారి, తాటిపెల్లి శ్రీనివాస్, పువ్వాటి హరికృష్ణ పాల్గొన్నారు.

నలుగురు ఏఈవోల సస్పెన్షన్

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహదేవపూర్ వ్యవసాయ డివిజన్‌లో నలుగురు వ్యవసాయ విస్తరణ అధికారులు సస్పెన్షన్‌కు గురైనట్లు మహదేవపూర్ వ్యవసాయ సహాయక సంచాలకులు కె.పాల్ తెలిపారు. రైతు బీమాకు సంబంధించి రైతుల వివరాల నమోదు ఆలస్యంపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు మహదేవపూర్ ఏఈవో ధర్మేంద్ర, మహాముత్తారం మండలం స్తంభంపల్లి ఏఈవో శివకృష్ణ, కాటారం మండలంలో చిదినేపల్లి ఏఈవో రాజన్న, చింతకాని క్లస్టర్ ఏఈవో దివ్య సస్పెన్షన్ అయినట్లు ఏడీఏ తెలిపారు.

ఆధునిక శిక్షణ.. అందని ద్రాక్షేనా?



ఏటీసీ నిర్మాణంలో జాప్యం

న్యూస్‌టుడే, కాటారం(భూపాలపల్లి జిల్లా)

నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు.. ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల(ఏటీసీ)ను ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించగా జిల్లాలోని మంథని నియోజవర్గ పరిధిలోని కాటారం మండలంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)కు అనుసంధానంగా ఏటీసీ మంజూరైంది. నిర్మాణానికి సుమారు రూ.4కోట్లకు పైగా మంజూరైనా నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. త్వరితగతిన నిర్మాణం చేపడితే నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

స్థల సమస్యతో జాప్యం..

గతంలో ఐటీఐ, ఏటీసీ నిర్మాణానికి గంగారం మోడల్ కళాశాల సమీపంలో ఏడెకరాల స్థలాన్ని కేటాయించారు. కొంత ఆక్రమణకు గురై వివాదంతో ఏటీసీ నిర్మాణం ముందుకు సాగలేదు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ త్వరితగతిన ఏటీసీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులు మండలకేంద్రంలో మినీ స్టేడియంకు ప్రతిపాదించిన తిమ్మనకుంట భూమిని పరిశీలించి ఎకరం కేటాయించారు. ఆ స్థలంలోనూ తమ ఇళ్ల స్థలాలు ఉన్నాయంటూ కొందరు అడ్డుకుంటుండడంతో ఏటీసీ నిర్మాణానికి ఆలస్యం జరిగింది. దీంతో మళ్లీ గంగారంలో కేటాయించిన స్థలంలోనే ఐటీఐ, ఏటీసీ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఆరు కొత్త కోర్సుల్లో శిక్షణ

యువతలో నైపుణ్యాలు అభివృద్ధిచేసి.. ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చేందుకు టాటా టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఏటీసీలలో ఆరు కొత్త కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ఒక సంవత్సరంలో పూర్తి చేసుకునే కోర్సులు.. మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్, రెండు సంవత్సరాల కోర్సులు బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వెహికల్ మెకానిక్ అనే ట్రేడ్‌ల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక ఏడాది కాలపరిమితి గల ట్రేడ్‌లో 40 చొప్పున సీట్లు, రెండేళ్ల కాలపరిమితి గల ట్రేడ్‌లో 24 సీట్లు చొప్పున అవకాశం కల్పించనున్నారు. ఇప్పటికే ఆధునిక కోర్సులపై ఐటీఐ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ప్రవేశాలు ఆలస్యం..

ఇప్పటికే చాలా వరకు ఏటీసీల్లో అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభమై భర్తీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సొంత మండలంలోనే ఏటీసీ నిర్మాణంలో జాప్యంతో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టలేదు. అడ్మిషన్లు ప్రారంభమైన ఇతర ఏటీసీల్లో చేరాలంటూ ప్రోత్సహిస్తున్నారు. నిరుద్యోగ యువతకు దూర ప్రయాణాలు, ఆర్థికభారం పడనుంది. దీంతో అటవీ ప్రాంత నిరుద్యోగ యువత ఆధునిక శిక్షణకు దూరమయ్యే అవకాశం ఉంది. త్వరితగతిన ఏటీసీ నిర్మాణం చేపట్టి ఈ ప్రాంత యువతకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)

త్వరలో అందుబాటులోకి కోర్సులు

- భిక్షపతి, ప్రిన్సిపల్, ఐటీఐ, కాటారం

ఏటీసీ నిర్మాణంలో జాప్యంతో నూతన కోర్సుల్లో అడ్మిషన్లు ప్రక్రియ ప్రారంభించలేదు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రక్రియ చేపడతాం. ఏటీసీతో ఆరు నూతన కోర్సుల్లో శిక్షణతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

పర్యటిస్తూ.. పరిశీలన చేస్తూ..



వరంగల్ కోటలో

వెంకటాపూర్, న్యూస్‌టుడే: రామప్పలో వరల్డ్ హెరిటేజ్ శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈ శిబిరంలో పాల్గొంటున్న వాలంటీర్లు మంగళవారం కాకతీయుల రాజధాని ఓరుగల్లులోని పర్యాటక ప్రదేశాలను పరిశీలించారు. వరంగల్ నగరంలోని వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట, భద్రకాళి ఆలయాలను సందర్శించారు. సాయంత్రం సౌండ్ అండ్ లైట్ షోను తిలకించారు. అనంతరం కాకతీయుల ప్రత్యేకత, ఆలయ నిర్మాణ శైలి, కాకతీయులు వాడిన సాంకేతిక పరిజ్ఞానం గురించి స్వయంగా తెలుసుకున్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, ప్రొఫెసర్ పాండురంగారావు, ట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, సౌండ్ అండ్ లైట్‌షో ఇన్‌ఛార్జి శ్రీనివాస్, పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



వేయిస్తంభాల ఆలయం వద్ద

పల్లెబడి నుంచి.. చదువుల గుడికి!

ఉపాధ్యాయ వృత్తిలోకి.. పంచాయతీ కార్యదర్శులు

జిల్లాలో వివిధ గ్రామాల అభివృద్ధికి నాలుగేళ్లుగా ఎంతో కీలకంగా వ్యవహరించారు.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాల అమలుకు కృషి చేశారు. చేస్తున్నది సర్కారు కొలువే అయినా.. ఉపాధ్యాయ వృత్తి అంటే అమితమైన గౌరవంతో ఇటీవల డీఎస్సీలోనూ ప్రతిభచూపి కొలువులు సాధించారు. పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలు వదిలి ఎంచుకున్న పాఠశాలల్లో చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పిస్తున్నారు. ఈ విషయమై వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయ కొలువుల్లో చేరిన వారిలో కొందరితో 'న్యూస్‌టుడే' ముచ్చటించింది.

న్యూస్‌టుడే, భూపాలపల్లి

ఉపాధ్యాయ వృత్తిమీద గౌరవంతో..

-ఇప్పకాయల సతీష్



భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్‌గడ్డ గ్రామానికి చెందిన ఇప్పకాయల సతీష్ ప్రస్తుతం చిట్యాల మండలం గోపాలపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా నియామకయ్యారు. ఇంతకు ముందు భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామంలో ఒక సంవత్సరం, ఆ తర్వాత మూడేళ్లు నందిగామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. మారుమూల అటవీ గ్రామాల అభివృద్ధిలో తన వంతు పాత్ర చురుకుగా పోషించారు. డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 3వ ర్యాంకు పొందారు. ఉపాధ్యాయ వృత్తిపై గౌరవంతో కార్యదర్శి ఉద్యోగాన్ని వదిలిపెట్టి పిల్లలకు మెరుగైన విద్యా బోధన కల్పిస్తున్నా..

రెండో ప్రయత్నంలోనే.. -జి.స్వప్న



రేగొండ మండలం జగ్గయ్యపేట గ్రామానికి చెందిన జి.స్వప్న 2019లో ఇదే మండలంలోని వెంకటేశ్వరపల్లె, చెంచుపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. కొద్ది నెలల క్రితమే చిట్యాల మండలం బావుసింగపల్లి పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వచ్చారు. చిన్నవయసు నుంచే టీచర్ ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో ఎంతో కష్టపడి బీఈడీ వరకు చదివారు. 2014లో టీటీసీ పూర్తి చేశారు. 2017 డీఎస్సీలో ప్రయత్నించగా ఉద్యోగం రాలేదు. రెండోసారి 2024 డీఎస్సీలో 75వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం మహదేవపూర్ మండలం ఎలికేశ్వరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరారు. స్వప్న నాలుగేళ్లపాటు మూడు గ్రామాల్లో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో చురుకైన పాత్ర పోషించడం విశేషం.

జేపీఎస్ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా..

-పైడాకుల రమేష్



మల్హర్ మండలం అనుసాన్‌పల్లి గ్రామానికి చెందిన పైడాకుల రమేష్ నాలుగేళ్ల క్రితం జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా అదే మండలంలోని నాచారం గ్రామంలో పనిచేశారు. కొద్ది నెలల క్రితం రెగ్యులర్ కావడంతో భూపాలపల్లి మండలం బావుసింగ్‌పల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. బీఈడీ పూర్తి చేసిన రమేష్ 2016 నుంచి 2017 వరకు భూపాలపల్లి మండలం గొర్లవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా వాలంటీరుగా పిల్లలకు విద్యా బోధన చేశారు. 2017లో నిర్వహించిన డీఎస్సీలో ప్రయత్నించినా ఉద్యోగం రాలేదు. రెండోసారి 2024 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా నియామకయ్యారు. ప్రస్తుతం భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.

అధిక పనిభారం తగ్గించుకోవడానికే.. -కత్తెరశాల మానస



చిట్యాల మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన కత్తెరశాల మానస 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. అదే మండలం జడల్‌పేట పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. ఈ మేరకు బీఈడీ పూర్తిచేసి, టీచర్ ఉద్యోగం చేయాలనే పట్టుదలతో 2017 డీఎస్సీలో ప్రయత్నించినా ఉద్యోగం రాలేదు. అయినా నిరాశ చెందకుండా కార్యదర్శిగా పనిచేస్తూ, మళ్లీ డీఎస్సీ కోసం సన్నద్ధం కావడంతో ఎస్‌జీటీలో 51 ర్యాంకు సాధించారు. ప్రస్తుతం టేకుమట్ల మండలం గరిమిళ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యదర్శిగా పనిచేయడంతో అధిక పనిభారంతో పాటు కొంత ఇబ్బంది ఏర్పడింది. అందుకే ఉపాధ్యాయ వృత్తి వైపు వచ్చినట్లు ఆమె చెప్పారు.

వైద్యుల నియామకానికి చర్యలు



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : చిట్యాల, మహదేవ్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి వైద్యుల నియామకానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య సిబ్బంది ఖాళీలు, వైద్య సేవల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలపై డీఎంహెచ్‌వో, జిల్లా జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు సంయుక్త నివేదికలు అందించాలన్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల పనుల పురోగతి తెలుసుకుని త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని చెప్పారు. పలు మండలాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో అవసరమైన పరికరాలు, సౌకర్యాల కల్పనకు నివేదికలు అందించాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా డ్యూటీ రోస్టర్ నిర్వహణ కట్టుదిట్టంగా పాటించాలని, ఆసుపత్రుల్లో విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో నిత్యం సమీక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయండి : జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ కార్యదర్శి దాసరి హరిచందన తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వేగవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలుంటాయా.. మామూలేనా!

● సీఎంఆర్ బియ్యం బుక్కి రూ.కోట్లు గడించిన మిల్లర్లు



గత నెల 20న బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన శ్రీ లక్ష్మి పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 యాసంగి సీజన్‌లో పౌరసరఫరాల శాఖ 62579.80 క్వింటాళ్ల ధాన్యం కేటాయించింది. మిల్లరు సీఎంఆర్ కింద ధాన్యం మరాడించి 42553.58 క్వింటాళ్ల బియ్యం అందజేయాల్సి ఉండగా 24,336 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చి మిగతాది బకాయిపడ్డారు. అందుకు సంబంధించిన రూ.6.49 కోట్ల విలువైన 26,790 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు మాయమైనట్లు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం గత నెల 20న మిల్లులో చేపట్టిన దాడుల్లో గుర్తించింది. ఈ మిల్లు జిల్లాలో పేరున్న ఒక మాజీ ప్రజాప్రతినిధిది. గతేడాది వానాకాలం సీజన్‌లో ధాన్యం కేటాయింపు నిలిపివేయగా అధికారులపై ఒత్తిడి తెచ్చి ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారు.

● మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచెర్ల శివారులోని నవ్య పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 సీజన్‌లో పౌరసరఫరాలశాఖ 53,560 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించింది. మిల్లర్లు సీఎంఆర్ కింద 36,240 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా 8,871 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా 27,549 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాలి. మిగతా 40,513 క్వింటాళ్ల ధాన్యంలో కేవలం 6,238 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దాంతో మిల్లరు ప్రభుత్వానికి రూ.8.36 కోట్లు నష్టపరిచినట్లు గత నెల 21న మిల్లులో తనిఖీ చేసిన రాష్ట్ర పౌరసరఫరాల టాస్క్‌ఫోర్స్ బృందం పేర్కొంది.

ఈనాడు, మహబూబాబాద్

ఉమ్మడి వరంగల్‌లోని కొంత మంది రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లాడించి సకాలంలో బియ్యం అప్పగించకుండా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. వీరిలో మూడు, నాలుగు సీజన్లకు సంబంధించి బియ్యాన్ని ఇవ్వని వారున్నారు. వీరికి పలుమార్లు గడువు ఇచ్చినా ఫలితం లేకపోయింది. క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో బకాయిపడ్డ మిల్లర్లు కొందరు ధాన్యాన్ని అడ్డదారిలో అధిక ధరలకు విక్రయించి రూ.కోట్లు గడించారు. వీరిపై ఈసారైనా చర్యలు తీసుకుంటారా లేదా ఎప్పటిలాగే 'మామూలు'గా వదిలేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

టాస్క్‌ఫోర్స్

ఇలా జరగాలి..

మిల్లులకు ధాన్యం కేటాయించిన తర్వాత అక్కడ లెక్క ప్రకారం నిల్వలున్నాయా.. లేవా, మిల్లాడిస్తున్నారా.. లేదా అనేది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా పౌరసరఫరాలశాఖ వద్ద సరిపడా సిబ్బంది లేదు. దాంతో పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా స్థాయిలో రెవెన్యూ అదనపు కలెక్టర్లు, మండల స్థాయిలో డిప్యూటి తహసీల్దార్లకు అప్పగించారు. వారు మిల్లులను పరిశీలించి బియ్యం నిల్వల నివేదికలను రాష్ట్ర అధికారులకు అందించాలి. తేడా లున్న మిల్లులకు మరో సీజన్‌కు సంబంధించి ధాన్యం కేటాయింపు నిలిపివేస్తారు.

ఇదీ జరుగుతోంది..

మిల్లర్ల అక్రమాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వకపోవడం వల్లనే ఒక సీజన్‌ది కాస్త నాలుగు సీజన్లకు పెరిగింది. ఇందుకు అధికారులు మిల్లర్ల నుంచి రూ.లక్షల్లో ఆమ్యామ్యాలను పుచ్చుకుంటూ ధాన్యం కేటాయింపులకు సహకరించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని మిల్లలకు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయించారు. అప్పుడు కూడా అధికారుల అండదండలతో పక్కదారి పట్టించారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 94 మంది రైస్ మిల్లర్లు బియ్యం అప్పగించలేదు. ● వీరిలో రెండు, అంతకంటే ఎక్కువ సీజన్లు బకాయి ఉన్న వారికి ప్రస్తుత సీజన్ నుంచి ధాన్యం కేటాయింపు నిలిపివేయాలనేది పౌరసరఫరాలశాఖ నిర్ణయించింది. మిల్లర్లు కొందరు ధాన్యం కేటాయింపుల కోసం గతంలో మాదిరిగానే అధికారులను మచ్చిక చేసుకోవడానికి మంతనాలు చేస్తున్నట్లు తెలిసింది.

బియ్యం బకాయిపడ్డ మిల్లర్లు (సీజన్లవారీగా)

జిల్లా	ఒకటి	రెండు	మూడు	నాలుగు	మొత్తం
హనుమకొండ	19	3	1	1	24
జనగామ	9				9
భూపాలపల్లి	9				9
వరంగల్	24	5			29
మహబూబాబాద్	16	5			21
ములుగు	5	1			6

ఉత్పత్తి వ్యయం.. సింగరేణిపై భారం

న్యూస్‌టుడే, భూపాలపల్లి

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వ్యయం రోజురోజుకు పెరుగుతోంది.. కోల్ ఇండియా సంస్థలైన మహానది కోల్‌ఫీల్డ్స్(ఒడిశా), వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్(మహారాష్ట్ర) కన్నా సింగరేణి సంస్థలో ఉత్పత్తిచేసే బొగ్గు ధర అధికంగా ఉంటోంది. రవాణా ఛార్జీల భారం కారణంగా రాష్ట్రంతో పాటు పలు దక్షిణాది విద్యుత్తు సంస్థలు సింగరేణిపైనే ఆధారపడుతున్నాయి. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్తులో సింగరేణి మనుగడపై ప్రభావం పడొచ్చనే అభిప్రాయం సంబంధిత అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. దీంతో పాటు గనుల్లోకి త్వరలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించనున్న తరుణంలో సింగరేణికి మరింత పోటీ ఎదురుకానుంది. వచ్చే ఐదారేళ్లలో ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోక తప్పదనే వాదన వినిపిస్తోంది.. ప్రస్తుతం ఈ అంశం అన్ని కోల్‌బెల్ట్ ఏరియాల్లో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు బొగ్గు బ్లాకులను కట్టబెట్టే అంశం కార్మికుల అభద్రతాభావానికి కారణమవుతోంది. ఈ క్రమంలోనే అన్ని కోల్ బెల్ట్ ఏరియాల్లో కార్మికులు, అధికారులు నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని ఇటీవల సింగరేణి ఎండీ బలరాం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఓసీపీ గనుల్లో అధిక బొగ్గు ఉత్పత్తి కోసం భూసేకరణ పనులను అధికారులు వేగవంతం చేశారు.

ప్రైవేటు సంస్థల కారణంగానే..



కేటీకే 5వ గని ఆవరణలో రవాణాకు సిద్ధంగా సింగరేణి బొగ్గు

ఇంత వరకు భూగర్భ, ఉపరితల గనుల్లో బొగ్గును నిర్ణీత మొత్తానికి వెలికితీసే పనులకు పరిమితమైన ప్రైవేటు కంపెనీలు.. ఇకపై ఏకంగా వేలంలో బొగ్గు బ్లాకులనే సొంతం చేసుకుంటున్నాయి. ఏడేళ్ల క్రితం భూపాలపల్లి డివిజన్‌లోని తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను కేంద్రం ఓ ప్రైవేటు సంస్థకు కేటాయించడంతో కార్మికుల్లో పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. దీంతో ప్రభుత్వం నిర్ణయాన్ని మార్చుకుని ఆ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించింది. కానీ, సింగరేణి ప్రాంతాల్లోనూ బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రెండేళ్లుగా చేపట్టడంతో ప్రైవేటు సంస్థలు వాటిని పొందే అవకాశం ఏర్పడింది. ఈ మేరకు సింగరేణి ప్రాంతంలోనే బయట కంపెనీలు పోటాపోటీగా బొగ్గు ఉత్పత్తి చేసి సింగరేణి కన్నా తక్కువ ధరకే విక్రయించే అవకాశం ఉంది. దీంతో మార్కెట్‌లో కొనుగోలుదారుల సంఖ్య తగ్గే ప్రమాదం కూడా లేకపోలేదు.

మార్కెట్‌లో పలు కంపెనీల బొగ్గు ధరల వివరాలు..

జీ-5 గ్రేడ్	రూ.5,685	రూ.2,970
జీ-16 గ్రేడ్	రూ.1,620	రూ.614

● బొగ్గు ధర (టన్ను)కు ● సింగరేణిలో ● మహానది, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో

ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచడానికే..

- హబీబ్ హుస్సేన్, సింగరేణి జీఎం.భూపాలపల్లి

ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడమే కాకుండా నిర్దేశిత లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి చేపట్టాల్సిన అవసరం ఉంది. కార్మికులు, ఉద్యోగులు 8 గంటల సమయంలో పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలి. ప్రైవేటు కంపెనీల కన్నా మరింత సమర్థతను కనబర్చి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి కార్మికులు, అధికారులు దృష్టి పెట్టాల్సిన బాధ్యత ఉంది. భూపాలపల్లి ఏరియాలో ఓసీ-2, ఓసీ-3 గనుల్లో బొగ్గు ఉత్పత్తి సాధించడానికి భూసేకరణ పనులు పూర్తి దశకు చేరాయి. ఈ ఏరియాలో సుమారుగా 738 ఎకరాల భూసేకరణ పూర్తయితే బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి సమస్య ఏర్పడదు. వచ్చే మూడు నెలల్లో ఓసీపీ గనులకు సంబంధించిన పనులు పూర్తి చేసి, సంబంధిత రైతులకు మెరుగైన నష్టపరిహారం చెల్లించనున్నారు.

మూడు వైపులా.. కష్టాలే!

నిత్యం వేలాది ప్రైవేటు వాహనాలు, కార్ల రాకపోకలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు ఇవన్నీ హనుమకొండ బస్టాండు ప్రాంతంలో కనిపించే ట్రాఫిక్ కష్టాలు. నగరవాసులు ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి వరంగల్‌కు కీలకమైన హనుమకొండ ప్రధాన బస్టాండులో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రత్యామ్నాయ మార్గాలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

● పద్మవ్యూహంలో హనుమకొండ బస్టాండ్
● ఛేదించడానికి ఉన్నాయి మార్గాలు

పరిశీలన


1 ఇది కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి.. బస్టాండ్‌లోని బస్సులన్నీ దీని ద్వారానే బయటకు వెళ్లాలి



ఎవరికి నచ్చినట్టు వారు..


ఆటోలు, ఫుట్‌పాత్‌లపై వాహనాలు

బస్టాండు లోపలికి వెళ్లే రెండు దారులు గందరగోళంగా ఉంటాయి. ఆటో వాలాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుంటారు. కొందరు ఆటో డ్రైవర్లు బస్టాండు నుంచి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అక్కడే చక్కర్లు కొడుతూ ట్రాఫిక్ సమస్యలు తెస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు వచ్చే వారి వాహనాలతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతోంది.

కట్టడి చేయడం కీలకం

☛ ఆటోవాలాలు క్రమ పద్ధతిలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడాలి. ☛ బస్టాండు రోడ్డుకు రెండు వైపులా ప్రైవేటు ఆసుపత్రుల వారు ఆక్రమించుకున్న ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించాలి. పాదచారులు నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.

సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

- నార్లగిరి రమేష్, ప్రయాణికుడు, హనుమకొండ



బస్టాండు రోడ్డు నుంచి మచిలీబజార్, పద్మాక్షిరోడ్డుకు వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇష్టారీతిగా పార్కింగ్ చేసి ఉంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నడుస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో పాటు, నగరపాలక సంస్థ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

ప్రైవేటు వాహనాలను అడ్డుకుంటున్నాం..

- విజయభాను, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్



బస్టాండులోకి ప్రైవేటు వాహనాల రాకకు పూర్తిగా అడ్డుకట్ట వేశాం. కాజీపేట, ములుగు రోడ్డు, పెట్రోల్‌పంపుల నుంచి కొన్ని బస్సులను నేరుగా పంపించేందుకు అక్కడ అనువైన స్థలం లేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తున్నాం.


2 ఇది కీలకమైన జంక్షన్ దారి.. దీన్ని మూసివేయడంలో ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది.

మూడు మార్గాలు ఉన్నా..

బస్టాండు లోకి వెళ్లడానికి మూడు దారులున్నాయి. కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి, బస్టాండు జంక్షన్ పక్కన ఒకటి, మసీదు పక్కన మరొకటి. అన్ని మార్గాల గుండా వచ్చే బస్సులు మసీదు పక్కన ఉన్న గేటు నుంచే బస్టాండ్‌లోనికి అనుమతి ఇస్తున్నారు. వందలాది బస్సులు ఇదే మార్గంలో లోపలికి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరోవైపు బస్సులన్నీ కేడీసీ దారిలో ఉన్న గేటు గుండా బయటకు వెళ్తుంటాయి.. కీలకమైన బస్టాండ్ జంక్షన్ దారిని ప్రమాదాలు జరుగుతున్నాయని మూసివేశారు.

ఇలా చేద్దాం

☛ గతంలో మాదిరిగానే బస్సులు లోపలికి వచ్చే మార్గాలు రెండు ఉండాలి.

☛ ఏటూరునాగారం, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట రూట్లలో వచ్చే బస్సులు హనుమకొండ చౌరస్తా మీదుగా మసీదు పక్క ఉన్న దారి గుండా లోపలికి వెళ్లాలి.

☛ హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జనగామ నుంచి వచ్చే బస్సులు జంక్షన్ వద్ద ఉన్న మార్గం ద్వారా లోపలికి వెళ్లే ఏర్పాటు చేయాలి.

☛ ప్రమాదాలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను ఉంచాలి. ప్రైవేటు వాహనాలు లోపలికి రాకుండా కట్టడి చేయగలిగితే ప్రమాదాలు జరగవు.


3 ఇది మసీదు పక్క నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే దారి.. బస్సులన్నీ ఇక్కడి నుంచే లోపలికి వెళ్లాలి..

వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ డిపోలు	మొత్తం బస్సులు	నిత్యం హనుమకొండ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సంఖ్య	ఉమ్మడి ఆరు జిల్లాల నుంచి వచ్చే బస్సులు	ప్రయాణించే మార్గాలు
9	908	60 వేలు	1200	374


ములుగు రోడ్డు బస్టాండు

ఇదీ పరిస్థితి

హనుమకొండ బస్టాండు ఇరుకుగా ఉంటుంది. పక్కపక్కనే ప్లాట్‌ఫారాలు ఉండటంతో బస్సులు లోపలికి వచ్చి బయటకు వెళ్లాలంటే గంటల కొద్ది సమయం వృథా అవుతోంది. ప్రయాణికులూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

పరిష్కారం

☛ హైదరాబాద్ తరహాలో బస్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ నగరంలో ఎంజీబీఎస్ ప్రధాన బస్ స్టేషన్ ఉన్నప్పటికీ కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఎక్కువ సంఖ్యలో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి నడుస్తాయి. వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి నడుస్తాయి. అదే తరహాలో ఇక్కడ కరీంనగర్, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక బస్‌స్టేషన్ నుంచి పంపిస్తే ఇబ్బందులు తీరుతాయి.

☛ హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో 20 శాతం బస్సులను హనుమకొండ బస్టాండు నుంచి కాకుండా కాజీపేట బస్టాండు నుంచి పంపిస్తే సగం ప్రయాణికులకు సమయం ఆదాతో పాటు ఆర్టీసీకి డీజిల్ ఆదా అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు ఉండవు.

☛ ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్ వెళ్లే వాహనాలు నేరుగా ములుగు రోడ్డు నుంచి వెళ్లేలా చూడాలి.

☛ కరీంనగర్, నిజామాబాద్ బస్సుల్లో కొన్నింటిని హనుమకొండ పెట్రోల్ పంపు నుంచి నేరుగా పంపించొచ్చు.

☛ రిజర్వేషన్ బస్సులను సైతం మరో చోటు నుంచి పంపించే ఏర్పాటు చేస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుంది.


కాజీపేట బస్టాండు


విలేకరుల సమావేశంలో కథానాయిక అనన్య, హీరో యువ చంద్రకృష్ణ

'పొట్టేల్' సినిమా బృందం సందడి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నగరంలో 'పొట్టేల్' సినిమా బృందం సందడి చేసింది. ఆకట్టుకునే కథ, మెప్పించే కథనంతో ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'పొట్టేల్' సినిమాను ఆదరించాలని కథానాయకుడు యువ చంద్రకృష్ణ, కథానాయిక అనన్య ప్రేక్షకులను కోరారు. మంగళవారం వరంగల్ వెంకట్రామా థియేటర్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వరంగల్‌కు చెందిన నిషాంత్ రెడ్డి, సురేశ్ చిత్రాన్ని నిర్మించారని, పక్కా పల్లె వాతావరణం, చిన్నపాప చదువు కోసం మేం పడిన కష్టం ఈ సినిమాలో కనిపిస్తుందని చిత్ర బృందం తెలిపింది. గురువారం సినిమా విడుదలవుతోందని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేశామని, తెలంగాణలో వరంగల్ నుంచే మొదలు పెడుతున్నామని వివరించారు. ఓటీటీలో కాకుండా సినిమాను థియేటర్‌లోనే చూడాలని అభ్యర్థించారు. అంతకు ముందు హీరో యువ చంద్రకృష్ణ తీన్మార్ డాన్స్ చేశారు. సమావేశం అనంతరం సినిమా పోస్టర్లను ఆవిష్కరించారు. కథానాయిక అనన్యతో స్వీయచిత్రం దిగడానికి అభిమానులు పోటీపడ్డారు.


అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 25న నిర్వహించాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా వేస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఇతర క్రీడాంశాలు షెడ్యూల్ ప్రకారమే ఉంటాయన్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)			
ఫాంరేటు:	125	డ్రెస్డ్:	213
రిటైల్:	147	స్కిన్‌లెస్:	243

ప్రధాని మోదీ ప్రత్యుత్తరం.. మురిసిన విద్యార్థులు

దేవరుప్పుల (జనగామ జిల్లా), మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7వ తరగతుల విద్యార్థులు వారంతా.. పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొడిపాక రమేశ్ ప్రోత్సాహంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ హిందీలో లేఖలు రాసి పోస్టు చేశారు. సోమవారం ప్రధాని కార్యాలయం నుంచి 'ధన్యవాదాలు' అంటూ ప్రత్యుత్తరం అందింది. దీంతో ఆ పల్లె వాసులు, విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కిషన్, చీకటి శ్రీను, కందిక దామోదర్, ప్రధానోపాధ్యాయుడు రాజు సమక్షంలో వాటిని విద్యార్థులకు అందించడటంతో పండగ వాతావరణం నెలకొంది.


గుండెంగ యూపీయస్ విద్యార్థులకు ప్రధాని రాసిన ప్రత్యుత్తరం


ప్రధాని రాసిన లేఖలతో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

భద్రపరుచుకుంటాం..



- మణిహర్షిత, ఏడో తరగతి

గత నెలలో పోస్టుకార్డుతో ప్రధాని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ మాస్టారు లేఖ రాయమంటే రాసి మరిచిపోయాం. ప్రస్తుతం తిరిగి లేఖ రావడంతో విద్యార్థులం అంతా చాలా ఆనందపడ్డాం. ఆంగ్లంలో వచ్చిన లేఖను ఉపాధ్యాయులు చదివి తెలుగులో వివరించారు. దేశ ప్రధాని నుంచి వచ్చిన ప్రత్యుత్తరం ఫ్రేమ్ కట్టించి ఇంట్లో భద్రపరుచుకుంటాం.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు

దామెర, న్యూస్‌టుడే: డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ జిల్లా పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు. దామెర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి, 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేశాడు. దీంతో అతనిపై ఖమ్మం జిల్లా పరిధిలో సుమారుగా 10కి పైగా కేసులు నమోదయ్యాయి. రూ.800తో మరో నకిలీ తుపాకీ కొనుగోలు చేశాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈ నెల 21న ఖమ్మం నుంచి రైలులో వరంగల్‌కు చేరుకుని అర్ధరాత్రి వేళ ఊరుగొండ వద్ద ఆటో దిగాడు. అక్కడ కిరాణం దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్రలేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లా పెట్టెలో రూ.2000 తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈక్రమంలో సంపత్ దుండగుడు వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. వెంటనే చేరుకున్న స్థానికులు అతణ్ని బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దుండగుడు వెంకటేశ్వర్లు వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరి వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్

సీతాఫలాల విక్రయాలు.. రాకపోకలకు తిప్పలు!



జనగామ పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు వైపు యూటర్న్ వద్ద బైపాస్ రహదారిపైనే సీతాఫలాల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు సీతాఫలాల కొనుగోళ్లకు ఆగడంతో కొంత మేర రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి పక్కగా కూర్చుంటే ఇబ్బందిగా ఉండదని విక్రయదారులుకు పోలీసులు సూచిస్తున్నారు.

– న్యూస్‌టుడే, జనగామ టౌన్


వరిసాగు అందం.. తేయాకు తోటల చందం



ఈ చిత్రం చూస్తుంటే అస్సాం రాష్ట్రంలోని తేయాకు తోటలను తలపిస్తున్నాయి కదూ. ఇది వరి విత్తనోత్పత్తి క్షేత్రం. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ శివారులో కావేరి విత్తన సంస్థ ఆధ్వర్యంలో రైతు ఆడ, మగ వరిని నాటారు. మగ వరి కోసి వేరు చేయడంతో మిగిలిన పంట తేయాకు తోటలో పాదుల్లాగ ఇలా కనిపిస్తోంది. దారిన పోయే బాటసారులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే భీమదేవరపల్లి

హరిత గిరి.. కొలువైన శ్రీహరి



పచ్చదనంతో అలరారుతూ ఆహ్లాదకరంగా ఉన్న ఈ కొండ హనుమకొండ జిల్లా భీమారం పరిధిలోని ఎర్రగట్టు గుట్ట. దీనిపై అనేక రకాల ఔషధ మొక్కలు, మధుమేహాన్ని నియంత్రించే తిప్పతీగ, చర్మ వ్యాధులను నయం చేసేందుకు వాడే గడ్డిపూల జాతి మొక్కలు ఉన్నాయి. వీటితో నల్లనేరేడు, సీతాఫలాలు, వేప తదితర వృక్షాలు ఉన్నాయి. ఈ గుట్టపైనున్న ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీహరి భక్తులకు కనులవిందుగా దర్శనమిస్తున్నారు.

– ఈనాడు హనుమకొండ, న్యూస్‌టుడే భీమారం

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం


పోటీపడుతున్న క్రీడాకారులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ చదరంగం సంఘం సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు మంగళవారం హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో ప్రారంభమయ్యాయి. వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 100 మంది బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ స్ఫూర్తితో రాణించాలని సూచించారు. అనంతరం బాలలతో చదరంగం ఆడి ఉత్తేజపరిచారు. పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా, ఆర్బిటర్స్ సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.


పార్కు ముఖద్వారం


నెలకొన్న పచ్చదనం


ఓపెన్‌జిమ్‌లో కసరత్తు

ఆహ్లాదకరం యతిరాజారావు పార్కు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో ఏకైక రెవెన్యూ డివిజన్ కేంద్రం తొర్రూరు. సుమారు 30 వేల పైచిలుకు జనాభా కలిగిన పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి రోజు సుమారు 2-3 వేల వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరులో ప్రజల సౌకర్యార్థం దివంగత నేత నెమరుగొమ్ముల యతిరాజారావు స్మారకంగా ఆయన పేరున ఏడెకరాల స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. మూడేళ్ల కింద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.2 కోట్లు కేటాయించి, అందులో ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, సేద తీరడానికి ప్రత్యేక బల్లలు, హట్స్, చూడముచ్చటైన విగ్రహాలు, ప్రత్యేకంగా వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఆటవిడుపుగా నిలుస్తోంది. చుట్టూ వాకింగ్‌ట్రాక్, నర్సరీ నుంచి మొక్కలను తెప్పించి నాటడంతో పచ్చందాలను సంతరించుకుంటుంది. అలాగే ఇక్కడ విజయదశమి నాడు రావణవధ కూడా ఘనంగా నిర్వహిస్తారు. క్రీడా పోటీలు, పలు చిత్రాల షూటింగ్‌లు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. నిత్యం 50 నుంచి 100 పిల్లలు కరాటే శిక్షణ పొందుతారు. ఇక సెలవు రోజుల్లో అయితే జనాల రాకతో కిక్కిరిసి కనిపిస్తుంది.

40 రోజులైనా.. నాన్చుడేనా?

ఉద్యోగాల భర్తీని విస్మరించిన అధికారులు

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలను వినియోగించుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.. సరిపడా సిబ్బందిని నియమించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. రాష్ట్రంలోని 9 జిల్లాలోని వైద్య కళాశాలలకు సరిపడా వైద్య సిబ్బందిని పొరుగు సేవల పద్ధతిలో నియమించుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నుంచి అనుమతులు వచ్చినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో నోటిఫికేషన్ ఇవ్వడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది జిల్లాల్లోని వైద్య కళాశాలలకు వివిధ రకాల 11 సేవలు అందించేలా 52 పోస్టులను పొరుగు సేవల పద్ధతిలో భర్తీ చేయాలని సెప్టెంబర్ 9న అనుమతులు వచ్చాయి. 40 రోజులకు పైగా గడుస్తున్నా సంబంధిత వైద్య కళాశాల అధికారులు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవడం లేదు. వైద్య కళాశాలలోని ప్రధానాధికారి వీటి భర్తీపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉన్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

భర్తీ చేయాల్సిన పోస్టులివీ..

లాబ్ అటెండెంట్స్, స్టోర్ కీపర్, రేడియోగ్రఫీ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, ఫ్లంబర్, వార్డ్ బాయ్ ఇలా 11 విభాగాలకు చెందిన 52 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. అందులో 11 పోస్టులు ప్రభుత్వ వైద్య కళాశాలలో విధులు నిర్వహించాల్సి ఉండగా 41 పోస్టులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది.



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

జిల్లా ఆసుపత్రిలో భారీగా ఖాళీలు

జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రతి రోజు 800 మందికి పైగా వివిధ రకాల వైద్య సేవలు పొందడానికి వస్తుంటారు. అయినా, ఒక్క వార్డు బాయ్ పోస్టు కూడా లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. డాటా ఎంట్రీ ఆపరేటర్ల 26 పోస్టులకు ఆరుగురు విధులు నిర్వహిస్తున్నారు. ఈసీజీ, ఎక్స్‌రే, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు తదితర పోస్టులు చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి వెంటనే పోస్టుల భర్తీ చేపట్టాలని ప్రజలు, నిరుద్యోగులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో నోటిఫికేషన్ : రాహుల్ శర్మ, జిల్లా కలెక్టర్



డీఎంఈ నుంచి పొరుగు సేవల పద్ధతిలో పలు ఖాళీల భర్తీకి అనుమతులు వచ్చాయి. వాటికి సంబంధించిన నోటిఫికేషన్ రెండు రోజుల్లో ప్రకటించనున్నాం. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత పోస్టుల భర్తీ 15 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అనుమతించిన పోస్టులు

కేటగిరీ	భర్తీ చేయాల్సిన పోస్టుల సంఖ్య
లాబ్ అటెండెన్స్	15
స్టోర్ కీపర్, డాటా ఆపరేటర్ స్టెనో, టైపిస్ట్, రికార్డ్ క్లర్క్, రికార్డ్ అసిస్టెంట్	7
రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్	8
అనస్తీషియా టెక్నీషియన్	4
దోబీ	4
ఎలక్ట్రీషియన్	2
ఫ్లంబర్	1
డ్రైవర్లు	1
థియేటర్ అసిస్టెంట్	4
గ్యాస్ ఆపరేటర్	2
వార్డ్ బాయ్స్	4

● కేటగిరీ ● భర్తీ చేయాల్సిన పోస్టుల సంఖ్య

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు



చిట్యాల : చిట్యాల మండలం జడల్‌పేట గ్రామంలోని భీష్మనగర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీని సిబ్బంది అరికట్టారు. మంగళవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి స్పందించారు. లైన్‌మెన్‌లు నంద స్వామి, తొట్ల రమేశ్ పైప్‌లైన్‌కు మరమ్మతు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఈనాడుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

స్పందనకు వందనం

పగిలిన తాగునీటి పైపులైన్



ఎస్సీ కాలనీలో సమీపంలో...

రేగొండలో ఎస్సీ, బీసీ కాలనీల్లో చాలాచోట్ల తాగునీటి పైపు పగిలిపోయాయి. దీంతో తాగునీరు కలుషితమవుతోందని యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీపీ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి పైపులకు మరమ్మతు చేసి నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కార్యదర్శి తుల్జారాణిని వివరణ కోరగా ఒకటి, రెండు రోజుల్లో మరమ్మతు చేయిస్తానని చెప్పారు. – న్యూస్‌టుడే, రేగొండ(భూపాలపల్లి జిల్లా)

నైపుణ్యం ప్రదర్శించి.. బహుమతులు సాధించి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ మైనార్టీ గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ ఎ.రవి, కో ఆర్డినేటర్ రషీద్‌ఖాన్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ప్రాంతంలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల విద్యాలయంలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని వెలిబుచ్చారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు జి.ప్రణయ్‌కుమార్, బి.శివయాదవ్, పి.హర్షవర్ధన్‌లకు ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రవి, కో ఆర్డినేటర్ రషీద్‌ఖాన్ బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

'రాజకీయ కక్షతోనే కేసుల పరంపర'

కాటారం, న్యూస్‌టుడే : మంథని నియోజకవర్గంలో ప్రశ్నించే భారాస నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని భారాస నాయకులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో భారాస మండల ఇంఛార్జి జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ నాయకులతో కలిసి మాట్లాడారు. స్థానిక పీహెచ్‌సీలో మందులు లేవని అడిగిన భారాస నాయకులపై రాజకీయ, వ్యక్తిగత కక్షతో వైద్యురాలితో తప్పుడు కేసులు నమోదు చేయించారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి అణచివేసే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. భారాస లీగల్ సెల్‌లో ఫిర్యాదు చేస్తామని, ఇలాంటివి పునరావృతమైతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యురాలిపై స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో భారాస నాయకులు వెంకటేశ్వర్‌రావు, సతీష్, శ్రావణ్, సంతోష్, రాజేంద్రచారి, వెంకటస్వామి, దుర్గారావు, రాజబాబు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బి.భిక్షపతి

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఈ నెల 26న హనుమకొండలోని హంటర్‌రోడ్డు ప్రాంతంలోని ప్రైవేటు వేడుకల మందిరంలో నిర్వహించనున్న మాదిగ ధర్మయుద్ధ మహాసభకు జిల్లా నుంచి మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బి.భిక్షపతి కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం అంబాల చంద్రమౌళి అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన భిక్షపతి మాట్లాడుతూ.. వర్గీకరణ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించిందని ఆరోపించారు. వర్గీకరణ అమలుకు మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు సతీష్, బట్టు విజయ్, నోముల శ్రీనివాస్, రాజేందర్, భిక్షపతి, సురేష్, రమేష్, తిరుపతి, సుమన్ అశోక్, కిరణ్ పాల్గొన్నారు.

'సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని నియంత్రించాలి'



మాట్లాడుతున్న ఏఐటీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

భూపాలపల్లి, న్యూస్‌టుడే : సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలకు పూర్తిస్థాయిలో గుర్తింపు ఇవ్వడం లేదని, విపరీతంగా పెరిగిన రాజకీయ జోక్యాన్ని నియంత్రించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కొంరయ్య స్మారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, దీంతో కార్మికులకు, యాజమాన్యానికి మధ్యలో ఉండే పారిశ్రామిక సంబంధాలు కుంటుపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్మిక సంఘాలను నిర్వీర్యం చేయడానికే యాజమాన్యం కుట్రలు చేస్తోందని, ఈ విధానం ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో సింగరేణి మనుగడకే ముప్పు ఏర్పడుతుందన్నారు. సింగరేణిలో నాలుగేళ్లకు పైగా అమలు కావాల్సిన విషయాలు పరిష్కారం కాలేదని, గుర్తింపు సంఘం నాయకులతో స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించకపోవడంతో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలుపొందిన 9 నెలల తర్వాత తమ సంఘానికి ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. దీంతో తొమ్మిది నెలల కాలంలో యాజమాన్యంతో కార్మికుల సమస్యలు, పదోన్నతుల గురించి చర్చించలేకపోయామన్నారు. వారసత్వ ఉద్యోగాల విషయంలో 35 నుంచి 40 ఏళ్ల వరకు వయసు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, ఈ విధానం అమలు కావడం లేదని చెప్పారు. తండ్రి మారుపేర్లతో చేసిన వ్యక్తులు, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కోల్ ఇండియాలో అమలవుతున్న క్యాడర్ స్కీం సింగరేణిలో అమలు కావడం లేదన్నారు. సమావేశంలో నాయకులు రాజ్‌కుమార్, ఎం.రమేష్, రాంచందర్, ఆసిఫ్‌పాషా పాల్గొన్నారు.

ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరి



చిన్నారుల తల్లులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ

చిట్యాల, న్యూస్‌టుడే : చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని నైన్‌పాక అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గ్రోత్ మేళా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.. పిల్లలు వయసు ప్రకారం బరువు, ఎత్తు పెరుగుతున్నారా లేదా ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే గుర్తించి వైద్య సిబ్బంది సాయంతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. మాటలు, పాటలు, ఆటలు, కథలు, ఆంగ్ల పదాలు ప్రతిరోజు నేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఒడితల పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద తదితరులు పాల్గొన్నారు.

పంటల క్షేత్ర పరిశీలన

కాటారం, న్యూస్‌టుడే : దేవరాంపల్లి గ్రామంలో మహదేవపూర్ వ్యవసాయ సంయుక్త సంచాలకులు(ఏడీఏ) శ్రీపాల్ పంటలను క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. వర్షాలతో సుడిదోమ, బ్యాక్టీరియా ఎండు తెగులు సోకిన వరి పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలని, రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. అనంతరం కాటారం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఈవోలు ఆస్మా, రాజన్న, సరిత, తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి 2024-25 విద్యా సంవత్సరానికి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ పరిశీలించాలని, ఈ నెల 29 దరఖాస్తుకు చివరి తేదీ అని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



గణపురం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్ ఆఫ్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన గణపురం జడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థి ఎండీ షారుఖ్‌ను మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్ఎం సతీశ్ మాట్లాడుతూ ఈ నెల 20న హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. భూపాలపల్లి జిల్లా నుంచి 12 మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా గణపురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ నెల 28న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు షారుఖ్ ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భరత్‌కుమార్, కుమారస్వామి, శకీరా భేగం, రాంబాబు, రమేశ్, శ్రీనివాస్, హేమలత పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రకటించాలని ఉపాధ్యాయుల నిరసన



చిట్యాలలో గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు

చిట్యాల, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మంగళవారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ములుకల్ల తిరుపతి, పత్తి వెంకటరామిరెడ్డి ధర్మాగ్రహ దీక్ష గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఇచ్చిన హామీలు విస్మరించిందని ఆరోపించారు. అవసరానికి డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 28న తహసీల్దార్లకు వినతిపత్రం, నవంబర్ 5న కలెక్టరేట్ల ముందు ధర్నా, 23న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యుడు బుర్ర సదయ్య, మండల అధ్యక్షుడు కానుగుల రఘుపతి, కార్యదర్శి గోపగాని భాస్కర్, గౌరవ అధ్యక్షుడు శ్రీరాం రఘుపతి, మారబోయిన మహేందర్ పాల్గొన్నారు.



రేగొండ మండలం తిర్మలగిరిలో..

రేగొండ : ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి డిమాండ్ చేశారు. తిర్మలగిరి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘ నేతలు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తిరుపతి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పీఆర్సీ, డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా, మండల నేతలు రమేశ్, అరవింద్, మనోహర్, మమత, దిలీప్, సాగర్, గిరిధర్, లక్ష్మయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్ రమణారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ



కాటారం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఆరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ఉచిత చేప పిల్లల పంపిణీ మంగళవారం చేపట్టారు. గంగపురి, విలాసాగర్, కొత్తపల్లి, ధన్వాడ, రేగులగూడెం, ఇబ్రహీంపల్లి సంఘాలకు సుమారు 5.40 లక్షల చేప పిల్లలను పంపిణీ చేశారు. పంపిణీ ఆలస్యమైందని, చేపలు ఉండాల్సిన పరిమాణం కన్నా తక్కువ పరిమాణంతో వచ్చాయని సంఘ నాయకుడు నాయిని శ్రీనివాస్, పలువురు ఆరోపించారు. ఈ సమయంలో ఇస్తే చేపలు ఎప్పుడు వృద్ధి చెందుతాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాబు, సంఘ అధ్యక్షుడు రాజబాబు ఉన్నారు.

చెకుముకి సంబరాల గోడపత్రికల ఆవిష్కరణ

చిట్యాల, న్యూస్‌టుడే : చెకుముకి సైన్స్ సంబరాలు-2024 గోడ పత్రికలను మండల కన్వీనర్ సూదం సాంబమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం చిట్యాల ఠాణాలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి చెకుముకి సైన్స్ సంబరాల టాలెంట్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనంతరం చెకుముకి మండల కన్వీనర్ మాట్లాడుతూ.. నవంబర్ 1న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయిలో టాలెంట్ టెస్ట్ ఉంటుందని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ మల్లేశ్, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, షాఖాన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సదయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన సౌకర్యాల కల్పనే లక్ష్యం



విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తున్న ఏబీసీడబ్ల్యూవో క్రాంతి, కిరణ్

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా వసతి గృహాలు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి క్రాంతి కిరణ్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో వార్డెన్ విక్రమ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వసతిగృహంలో ప్రతి విద్యార్థికి అనుకూలమైన వాతావరణం ఏర్పాటు చేసి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. నాణ్యమైన సరకులతో పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. సెలవులు పూర్తయిన వెంటనే పిల్లలను వసతి గృహానికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సిబ్బంది మనోజ్, రహీమ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పాఠశాల తనిఖీ



గణపురం, న్యూస్‌టుడే : గణపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్ తనిఖీ చేశారు. ఎస్ఏ-1 పరీక్షల తీరు పరిశీలించి ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో సమావేశమై ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏఎంవో లక్ష్మణ్, సెక్టోరియల్ అధికారి రాజగోపాల్, ఎంఈవో ఉప్పలయ్య పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వరం నుంచి పొరుగున ఉన్న మహారాష్ట్రకు మద్యం తరలిస్తుండగా అంతర్రాష్ట్ర వంతెన కన్నెపల్లి మూలమలుపు వద్ద పోలీసులు పట్టుకున్నారు. సిరొంచా తాలూకా చింతలపల్లికి చెందిన జానకి వెంకన్న అనే వ్యక్తి కాళేశ్వరం మద్యం దుకాణం నుంచి ఆ ప్రాంతంలో విక్రయించేందుకు సరకును తీసుకెళ్తుండగా ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకొని ఠాణాకు తరలించారు. వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చక్రపాణి తెలిపారు.

'రైతు సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్'

టేకుమట్ల, న్యూస్‌టుడే : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు రైతుభరోసాతో పాటు రైతు రుణ మాఫీ చేస్తానని చెప్పి ఇప్పుడు విస్మరించిందని భారాస మండలాధ్యక్షుడు సట్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస హయంలో రైతులను అన్ని విధాలా ఆదుకున్నామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తానని చెప్పి మాట తప్పారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో అక్రమాలు పెరిగిపోయాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధిచెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, పొతనవేని అయిలయ్య, ఉపాధ్యక్షుడు బొడ్డు సదానందం, ఆది రఘు, కార్మిక శాఖ మండలాధ్యక్షుడు నేరేళ్ల రామకృష్ణ, దొడ్ల కోటి, ఉద్దమారి మహేశ్ పాల్గొన్నారు.

డీపీవో ఆకస్మిక తనిఖీ

మల్హర్, న్యూస్‌టుడే : మల్హర్ మండలం కొయ్యూర్‌లో మంగళవారం పంచాయతీ అధికారి నారాయణరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పుస్తకాలు, ఇతర వసతులపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. డీఎల్‌పీవో వీరభద్రయ్య, జిల్లా గ్రంథాలయ అధికారి శ్రీలత పాల్గొన్నారు.



మహదేవపూర్ : గ్రంథాలయాన్ని పాఠకులకు సౌకర్యవంతంగా ఉంచాలని పంచాయతీ అధికారి వి.నారాయణరావు పేర్కొన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని మంగళవారం పరిశీలించారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, రోజూ వచ్చే పాఠకుల సంఖ్య, రికార్డులను చూశారు. అంబట్‌పల్లిలో సైతం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ అధికారి శ్రీలత, పంచాయతీ కార్యదర్శి కల్పన పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై తమాషారెడ్డి

పలిమెల, న్యూస్‌టుడే : అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై తమాషారెడ్డి అన్నారు. మంగళవారం పలిమెల గుత్తికోయగూడెంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి ఎస్సై మాట్లాడారు. మావోయిస్టులకు సహకరించవద్దని, అనుమానిత వ్యక్తుల సంచారంపై సమాచారం పోలీసులకు ఇవ్వాలని సూచించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం కుమురం భీం



చిట్యాలలో

టేకుమట్ల, న్యూస్‌టుడే : ఆదివాసీల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన కొమురం భీం గిరిజనుల ఆరాధ్య దైవమని ఏవైఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య అన్నారు. కొమురం భీం జయంతి వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఏవైఎస్ మండలాధ్యక్షుడు ఆరకొండ రాజయ్య ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మారపెల్లి కొమురయ్య, గుర్రపు రాజేందర్, నేరేళ్ల రామకృష్ణ, మాడుగుల వీరయ్య పాల్గొన్నారు.

చిట్యాల : అంబేడ్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కుమురం భీం నిజాం సర్కార్‌పై చేసిన పోరాటం, గిరిజన హక్కుల కోసం చేసిన కృషిని నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గుర్రపు రాజేందర్, గురుకుంట్ల కిరణ్, నేరెళ్ల ఓదెలు, మైదం శ్రీకాంత్, ఓదెలు పాల్గొన్నారు.



టేకుమట్లలో

మహదేవపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొమురం భీం చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్, రమేష్, రాజు, మాధవి, రవీందర్ పాల్గొన్నారు.